APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం



పంపుటి : 1 | సంచిక : 5 | ఒంగోలు | ఆదివారం 7-9-2025 | ఎడిటర్ : కుమార్ | పబ్లిషర్ : నరాల మురళీ | పేజీలు : 4 | వెల : రూ. 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar

### ఐరాస సమావేశాలకు

## ప్రధాని మోదీ దూరం



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** అమెరికాలో జరిగే ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాలకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కావడం లేదని సమాచారం. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో విడుదల చేసిన తాత్కాలిక వక్తల జాబితా ద్వారా తెలుస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటుందని అమెరికా భారత్‌పై అదనపు సుంకాలు విధించిన వేళ ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో భారత్ ఈ? కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం. యూఎన్ జనరల్ అసెంబ్లీ 80వ సెషన్ సెప్టెంబర్ 9న ప్రారంభంకానుంది. ఇవి సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు కొనసాగనున్నాయి. ఇందులో సర్వసభ్య దేశాల ప్రతినిధుల అత్యున్నత స్థాయి సమావేశాలు జరుగుతాయి. కాగా ఈ సమావేశాల్లో బ్రెజిల్ దేశాధినేత ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జనరల్ అసెంబ్లీ 80వ సెషన్ ఉన్నత స్థాయి జనరల్ చర్చకు, వక్తల సవరించిన తాత్కాలిక జాబితాను శుక్రవారం విడుదల చేసింది. దాని ప్రకారం భారతదేశానికి ఒక 'మంత్రి' ప్రాతినిధ్యం వహిస్తారని ఉంది. దీంతో ప్రధాని మోదీ యూఎన్ సమావేశాలకు దూరంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. జులైలో విడుదల మిగతా 2లో

## జీఎస్టీ 2.0పై బీజేపీ స్పెషల్ ప్రచారం

### అన్ని రాష్ట్రాలకు నిర్మల థ్యాంక్యూ లెటర్.. జీఎస్టీలో కీలక సంస్కరణలపై



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కీలక మార్పులు చేసిన కేంద్రప్రభుత్వం, ఇప్పుడు కొత్త సంస్కరణల గురించి వ్యాపారులు సహా ప్రజలకు తెలియజేయడానికి దేశవ్యాప్తంగా ప్రచారం కార్యక్రమాన్ని ప్లాన్ చేసింది. సెప్టెంబరు 22 నుంచి కొత్త పన్ను రేట్లు అమల్లోకి రానుండగా, దేశంలోని ప్రతి జిల్లాలో కూడా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన ప్రతినిధి అనిల్ బలూని తెలిపారు. "జీఎస్టీ సంస్కరణలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. జీఎస్టీ సంస్కరణల గురించి సామాన్య ప్రజలకు తెలియజేయాలని మేం రాష్ట్రాలు, జిల్లాల్లోని మా యూనిట్లను కోరాం" అని పార్టీ ప్రధాన ప్రతినిధి అనిల్ బలూని శనివారం తెలిపారు. ప్రతి జిల్లాలో జీఎస్టీ సంస్కరణల గురించి ప్రజలకు తెలియజేయడానికి 'చౌపల్స్' నిర్వహించాలని ప్లాన్ చేశామని చెప్పారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.

**దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు :** జీఎస్టీ సంస్కరణలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వివిధ కార్యక్రమాలను బీజేపీ నిర్వహించనుందని బలూని చెప్పారు. సీనియర్ కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శుల విలేకరుల సమావేశాలు ప్రతి రాష్ట్రంలో కూడా జరుగుతాయని తెలిపారు. ఈ విషయంలో పార్టీ త్వరలో మరిన్ని వివరాలను పంచుకుంటుందని వెల్లడించారు. ప్రణాళికలను మిగతా 2లో

జనసేన

### అదే జనసేనకు

## భారీ లోటు

### వ్యూహం రెడీ ?

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ఏపీలో మూడవ రాజకీయ పార్టీగా ఆవిర్భవించిన జనసేన నెమ్మదిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది. ఏపీలో మూడవ రాజకీయ పార్టీగా ఆవిర్భవించిన జనసేన నెమ్మదిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది. పాతికేళ్ళ పాటు రాజకీయాల్లో ఉంటాను అని 2014లో ప్రకటించి మరీ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వారు పవన్ కళ్యాణ్. అందుకు తగినట్లుగానే తొలి ఎన్నికల్లో పోటీ చేయలేదు. బీజేపీకి టీడీపీకి మద్దతు ఇచ్చారు. ఇక 2019 ఎన్నికల్లో పోటీ చేశారు, అయితే తాను పోటీ చేసిన రెండు సీట్లలో ఓటమి చవి చూసారు. ఇక 2024లో టీడీపీ బీజేపీలతో కలసి భారీ పొత్తునే కుదిర్చారు. అలా ఏపీ రాజకీయాలను మలుపు తిప్పేలా అధ్భుతమైన ఫలితాలను సాధించారు. ఇక ఏపీలో కూటమి ప్రభుత్వంలో జనసేన కీలక మిగతా 2లో

### చంద్రబాబు ట్వీట్

## ఎక్కడికో తీసుకెళ్లింది

### దశ, దిశ మారిపోయింది! ఒక్క నిర్ణయం ఖరీదు వందకోట్లు

## మ్యాథ్స్ టీచర్ సక్సెస్ స్టోరీ




**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** సోషల్ మీడియా ఎంత శక్తిమంతమైనదో నిరూపించే కథ ఇది.. సోషల్ మీడియాను మంచిగా వాడితే ఎలాంటి ఫలితాలు వస్తాయనేదానికి ఈ కథనమే ఓ నిదర్శనం. పిల్లలకు అర్థమయ్యేలా లెక్కలు సబ్జెక్టును బోధించేందుకు ఓ టీచర్ వీడియోలు రూపొందించి, యూట్యూబ్ లో అప్ లోడ్ చేస్తే 100 దేశాల్లోని తెలుగు ప్రజలు ఆ చానల్ ను ఫాలో అవుతూ, తమ పిల్లల సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. అంతేకాకుండా యూట్యూబ్ లో ఆ వీడియోలను చూసిన ఎన్ఆర్ఐలు చానల్ నిర్వాహకురాలైన ప్రభుత్వ పాఠశాల టీచర్ శ్రమను గుర్తించి విరాళాల ద్వారా స్కూల్ రూపురేఖలే మార్చేశారు. ఈ సక్సెస్ స్టోరీలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఓ ట్వీట్ కీలకంగా మారడం విశేషం. టీచర్స్ డే సందర్భంగా వెలుగులోకి వచ్చిన ఈ అంశం ఉపాధ్యాయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. రాజమండ్రిలోని లాలా చెరువు మున్సిపల్ హైస్కూల్ ఆ నగరంలో ఉన్నవారికి తెలుసు.. కానీ, మిగతా 2లో

## అందరికీ ఆరోగ్య బీమా

### 31 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 3,257 వైద్యసేవలు

**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** హైబ్రిడ్ మోడ్‌లో బీమా సంస్థల ద్వారా నగదు రహిత వైద్యసేవలు -ఏడాదికి ప్రభుత్వంపై రూ.641.07 కోట్ల భారం రాష్ట్రంలో పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఉచిత ఆరోగ్యబీమా అందుబాటులోకి వస్తోంది. 1.63 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.2.5 లక్షల వరకు నగదు రహిత వైద్యసేవలు అందిస్తారు. వీరిలో 1.43 కోట్ల పేద కుటుంబాల(బీపీఎల్)కు ఏడాదికి రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వం



నిర్ణయించింది. వర్కింగ్ జర్నలిస్టులకూ ఈ పథకం ప్రయోజనాలు వర్తింపజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ పథకం వల్ల రాష్ట్రంలో 5.02 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతుంది. ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన (పీఎంజేఏవై), డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా ఈ కొత్త ఆరోగ్య విధానం అమలుకానుంది. ప్రస్తుతం డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల ట్రస్టు ద్వారా వైద్యసేవలు అందిస్తుండగా ఇక నుంచి హైబ్రిడ్ విధానంలో ఆరోగ్యబీమా అందిస్తారు.

**అందించే వైద్యసేవలు :** 31 సూపర్ మిగతా 2లో

### ఏ ఒక్కరూ ఓటు హక్కు

## కోల్పోకుండా చూసుకోవాలి

### పాన్ ఇండియా వైడ్‌గా ఎస్ ఐ ఆర్.. ఎన్నికల సంఘం కీలక భేటీ

**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** బిహార్‌లో ఇటీవల ఓటరు జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టిన ఎన్నికల సంఘం, ఇప్పుడు దేశవ్యాప్తంగా చేపట్టాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రతినిధులతో దేశవ్యాప్త అమలుకు సంబంధించిన సంసిద్ధతపై చర్చించనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు శనివారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు వచ్చే వారం రాష్ట్ర ప్రతినిధులతో చర్చించనున్నట్లు చెప్పారు.

**ఇప్పుడు మూడో సమావేశం!**

పోల్ అథారిటీ బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 10న జరగనున్న సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరిలో జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది మూడ CEOల సమావేశం. బిహార్ తర్వాత, దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం స్పెషల్ రివిజన్ నిర్వహించనుందని పేర్కొన్నారు. 2026లో మిగతా 2లో

## సముద్రం 'అల'జడికి అడ్డుకట్ట!

### తీరం రక్షణకు వ్యూహాత్మక ప్రణాళిక




**విశాఖపట్నం, ప్రజలకు చేరువ ప్రతినిధి :** విశాఖలో సముద్ర తీర ప్రాంతంలో కోత నివారణకు అడ్డుకట్ట పడనుంది. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థతో కలిసి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ తలపెట్టిన ప్రాజెక్టులో కీలక అడుగు పడింది. సవివర ప్రాజెక్టు నివేదిక సాంకేతిక కమిటీ ఆమోదం లభించింది. చివరిగా కేంద్ర హెూంశాఖతో సమావేశమే మిగిలుంది. నివారణ చర్యలకు సంబంధించి కొన్ని అంశాలను వీఎంఆర్‌డీఏ అధికారులు వివరించాల్సి ఉంది. త్వరలోనే సమావేశం తేదీ ఖరారు కానుంది. రూ.203 కోట్ల అంచనాలతో మిగతా 2లో

## ఎర్రకోటలో భారీ దొంగతనం

### రూ.కోటి విలువైన బంగారు కలశాలు మాయం!

**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** దిల్లీ ఎర్రకోటలో భారీ దొంగతనం జరగడం కలకలం రేపింది. ఇటీవల జరిగిన ఓ మతపరమైన కార్యక్రమంలో రూ.కోటి విలువైన రెండు కలశాలు చోరీ అయినట్లు అధికారులు చెప్పారు. పూజ కోసం తీసుకొచ్చిన కలశాలు కనిపించడం లేదని వ్యాపారవేత్త ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, సెప్టెంబర్ 3న ఉదయం ఎర్రకోటలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమం అనంతరం పూజ కోసం తీసుకువచ్చిన 760 గ్రాములు బంగారు మిగతా 2లో





## పెద్ద ప్లానింగే..?

### ఆసక్తి రేకెత్తిస్తున్న మోదీ-లోకేశ్ భేటీ

**న్యూఢిల్లీ/అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ప్రధాని మోదీతో మంత్రి లోకేశ్ భేటీ కావడం ఇది రెండో సారి. ప్రధాని ఆహ్వానం మేరకు గత మే నెలలో ఒకసారి లోకేశ్ కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లి ప్రధానితో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధాని మోదీతో టీడీపీ భావినేత, ఐటీ, హెచ్ఆర్డీ మంత్రి నారా లోకేశ్ భేటీ రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. జీఎస్టీ సంస్కరణలు, రాష్ట్రానికి నిధులు అంటూ ఏవేవో కారణాలు చెబుతున్నా, ప్రధాని మోదీతో మంత్రి లోకేశ్ భేటీకి ప్రధానంగా రాజకీయ కారణాలే ఎక్కువ ఉన్నాయని అంటున్నారు. దేశంలో బలమైన రాజకీయ శక్తిగా ఉన్న బీజేపీ, ఏపీలో తిరుగులేని స్థితిలో ఉన్న టీడీపీ పరస్పర ప్రయోజనాలను ఆశిస్తున్నట్లు ఈ సమావేశాల ద్వారా తెలుస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధాని అపాయింటెమ్మెంట్ కోసం సీఎంలు, కేంద్ర మంత్రులు, ఎంపీలు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితుల్లో మంత్రి లోకేశ్ నుంచి విన్నపం వెళ్లగానే పీఎం మోదీ సమయం కేటాయిస్తుండటం విశేషంగా మిగతా 2లో

(మొదటి పేజీ తరువాయి)

## ప్రధాని మోదీ దూరం

చేసిన తాత్కాలిక వక్తల జాబితా ప్రకారం, మోదీ సెప్టెంబర్ 26న జనరల్ డిబేట్‌లో ప్రసంగించాల్సి ఉంది. అయితే సెప్టెంబర్ 27న మోదీ స్థానంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ప్రసంగించనున్నారని సమాచారం. ఇది తుది షెడ్యూల్ కానందున యూఎన్ సమావేశాల ప్రారంభానికి ముందు కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. కాగా ఈ సమావేశాల్లో చైనా, ఇజ్రాయెల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాధినేతలు సెప్టెంబర్ 26న ప్రసంగించనున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ఏటా సెప్టెంబర్‌లో ఉన్నత స్థాయి సమావేశాలు ప్రారంభమౌతాయి. ఈ ఏడాది సెప్టెంబర్? 22న ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవాన్ని స్మరించుకోవడం అనే సమావేశంతో ఈ సెషన్? ప్రారంభమౌతుంది. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ద్వైపాక్షిక సమావేశం కోసం మోదీ అమెరికాకు వెళ్లారు. వాషింగ్టన్?లోని శ్వేతసౌధంలో డొనాల్డ్? ట్రంప్?తో మోదీ భేటీ అయ్యారు.

**ఎస్?సీఓ సదస్సులో ముగ్గురు దేశాధినేతలు :** రష్యా నుంచి భారత్ అధికంగా చమురు దిగుమతి చేసుకుంటోందని ట్రంప్? భారత్?పై 50శాతం సుంకాలు విధించారు. దీంతో కొద్దికాలంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజాగా షాంఘై శిఖరాగ్ర సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యారు. ఎస్‌సీఓ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ప్రధాని మోదీ పాల్గొన్నారు. దీనిపై ట్రంప్ స్పందించారు. తమ దేశంపై భారత్? అధిక సుంకాలు విధిస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా రష్యా అధ్యక్షుడు అమెరికా విధిస్తున్న సుంకాల గురించి తాజాగా ప్రస్తావించారు. భారత్?, చైనా వంటి దేశాలపై సుంకాల పేరుతో చర్యలు తీసుకోవడం కాలం చెల్లిన వలసవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. ఆసియాలోని రెండు అతిపెద్ద శక్తులను అణగదొక్కడానికి, ట్రంప్ సర్కార్ ఆర్థిక ఒత్తిడిని ఒక సాధనంగా ఉపయోగిస్తోందని ఆరోపించారు. చైనాలో జరిగిన సైనిక కవాతులో పాల్గొన్న పుతిన్ అనంతరం మీడియాతో మాట్లాడారు.

## జీఎస్టీ 2.0పై బీజేపీ స్పెషల్ ప్రచారం

ప్రకటిస్తుందని చెప్పారు. మరోవైపు, జీఎస్‌టీ సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లేఖ రాశారు. పన్ను రేట్లను సవరించడంలో రాష్ట్రాలు భిన్న అభిప్రాయాలు తెలియజేశాయిని, అయినప్పటికీ ఏకాభిప్రాయానికి రావడం గొప్పవిషయమని అన్నారు. సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. జీఎస్టీలో సంస్కరణలను అమలు చేయడంలో వారి మద్దతు, చురుకైన పాత్రకు కృతజ్ఞతలు తెలిపారు. "నిన్న, నేను ప్రతి ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఒక లేఖ రాశాను. మీరు తీవ్రమైన చర్చలు, వాదనలు జరపవచ్చు, కానీ చివరికి, కౌన్సిల్ సందర్భానికి తగ్గట్టుగా స్పందించి భారతదేశ ప్రజలందరికీ ఉపశమనం కలిగించారు. అందుకే లేఖ రాశాను" అని నిర్మల తెలిపారు. కేంద్రం చేసిన ప్రతిపాదనను చర్చించడానికి సెప్టెంబర్ 3 నుంచి రెండు రోజుల పాటు ప్యానెల్ సమావేశం కావాల్సి ఉంది. కానీ రోజంతా జరిగిన మారథాన్ సమావేశం తర్వాత మొదటి రోజే దానిని ఆమోదించింది. "కాబట్టి సభాముఖంగా చెప్పినట్లుగా, ఇది సామాన్యులకు నిస్సందేహంగా ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదన. దీనికి వ్యతిరేకంగా నిలబడటంలో అర్థం లేదు. చివరికి అందరూ మంచి కారణం కోసం కలిసి వచ్చారు. నేను నిజంగా చాలా కృతజ్ఞురాలిని" అని నిర్మల అన్నారు. రాష్ట్రాలు ఎల్లప్పుడూ రేటు తగ్గింపుకు అనుకూలంగా ఉన్నాయని, పన్ను కోతల తర్వాత వారి ఆదాయ ప్రభావాలకు సంబంధించినది మాత్రమే వారి ఆందోళన అని తెలిపారు. "భారత ప్రజల దృష్ట్యా, దయచేసి, నేను వారికి విజ్ఞప్తి చేశాను. ఇది రాష్ట్రాలు మాత్రమే కాదు. తగ్గింపు వల్ల ప్రభావితమయ్యేది కేంద్రం కూడా. కానీ రేట్లు తగ్గిన తర్వాత, ప్రజలు కొనుగోలు చేయడానికి ముందుకు వస్తారు. అది (ఆదాయ ప్రభావం) చూసుకుంటారు కాబట్టి మేం దానిని భర్తీ చేస్తాము. ఆ విధంగా ఏకాభిప్రాయం కుదిరింది" అని ఆమె అన్నారు.

## అదే జనసేనకు భారీ లోటు

పాత్ర పోషిస్తోంది. ఉప ముఖ్యమంత్రి వంటి పదవిని పవన్ అందుకున్నారు. చంద్రబాబు తరువాత స్థానంలో ఆయన ఉన్నారు. రాజకీయంగా ఈ అవకాశాన్ని జనసేన వాడుకుంటోంది. అయితే అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు కావస్తున్నా జనసేన ఇంకా గట్టిగా తన ప్రభావం చూపించలేకపోతోంది. విస్తరించాల్సిన తీరులో ముందుకు సాగడం లేదు అన్నది ఉంది అంతే కాదు జనసేన మీద విమర్శలు వస్తే గట్టిగా రియాక్ట్ అయి మరోసారి వాటిని రిపీట్ చేయనీయకుండా లాజిక్ తో దెబ్బకొట్టి అవతల పెట్టే వారు లేకుండా పోయారు అన్నది ఉంది. ఇదే జనసేనకు అతి పెద్ద కొరత లోటు అని అంటున్నారు. %ూశ్రీంశీ =ఘు౦% – ముంబైలో తీగలాగితే హైదరాబాద్ లో డ్రగ్స్ ఫ్యాక్టరీ.. మాస్టర్ మైండ్ ఓ ఐటీ ప్రొఫెషనల్.. అధికార ప్రతినిధులు కావాలి : జనసేన పార్టీ వాయిస్ వినిపించాలి అన్నా లేక ప్రభుత్వం లో ఉంటూ తాము చేస్తున్నది ఎప్పటికపుడు జనాలకు చేరువ చేసే వారు కావాలీ అంటే తప్పకుండా అధికార ప్రతినిధులు ఉండాల్సిన అవసరం ఉంది అని అంటున్నారు. వైసీపీ చేస్తున్న విమర్శలను ధీటుగా ఎదుర్కొని జవాబు చెప్పేవారు కావాల్సి ఉంది. అంతే కాదు టీవీ డిబేట్ లో సమర్ధంగా పార్టీ ఫిలాసఫీని ముందు పెట్టి ప్రత్యర్ధుల నోర్లు మూయించే వారు కూడా అవసరం ఉంది అంటున్నారు. %ూశ్రీంశీ =ఘు౦% – ఒక్క నిర్ణయం ఖరీదు వందకోట్లు.. ఖాళీ జెర్సీతో టీమ్ ఇండియా విశాఖ పార్టీ మీట్ లో అదే : ఇక తాజాగా విశాఖ వేదికగా మూడు రోజుల పాటు జనసేన నిర్వహించిన పార్టీ సమావేశాలలో ఇదే అంశం మీద చర్చ సాగింది అని అంటున్నారు. జనసేనకు సమర్ధులు అయిన అధికార ప్రతినిధులు ఉంటే పార్టీ ప్రభుత్వం మీద వచ్చే విమర్శలను తిప్పికొడతారు అని అభిప్రాయం అయితే వ్యక్తం అయింది అని అంటున్నారు. దీని మీద కూడా అధినాయకత్వం అందరి అభిప్రాయాలను తీసుకుందని అంటున్నారు. త్రిశూల్ వ్యూహం అదేనట : ఇక జనసేన ప్రకటించిన త్రిశూల్ వ్యూహం అదే అని అంటున్నారు. ఈ వ్యూహంలో భాగంగా ముగ్గురు రాష్ట్ర స్థాయి అధికార ప్రతినిధులను వీలైనంత తొందరలో నియమిస్తారు అని అంటున్నారు. వీరి ద్వారా పార్టీని ప్రభుత్వాన్ని బలంగా మరింత పెద్ద ఎత్తున జనంలోకి తీసుకుని వెళ్తారు అని అంటున్నారు. వైసీపీ వంటి పార్టీలు చేసే విమర్శలకు బలంగా జవాబు చెప్పాల్సిన అవసరం గురించిన జనసేన అధినాయకత్వం ఈ విధంగా పార్టీలో చర్యలు తీసుకోనుందని అంటున్నారు. చూడాలి మరి ఆ నియామకాలు ఎపుడు జరుగుతాయో..

## ఎక్కడికో తీసుకెళ్లింది

అక్కడ పనిచేస్తున్న మంగారాణి టీచర్ ను యావత్ ప్రపంచానికి పరిచయం చేసింది యూట్యూబ్. లాలా చెరువు మున్సిపల్ హైస్కూలులో టీచరుగా పనిచేస్తున్న మంగారాణి.. పిల్లల సందేహాలను నివృత్తి చేయడానికి చిన్నచిన్న వీడియోలు చేసేవారు. వాటి ద్వారా పిల్లలు బాగా చదువుకుంటుండటంతో ఆ వీడియోలను మిగతా ఉపాధ్యాయులతో పంచుకోవాలని యూట్యూబ్ లో అప్ లోడ్ చేసేవారట.. ఇలా యూట్యూబ్ లో 2.38 లక్షల సబ్ స్క్రైబర్లను సాధించిన మంగారాణి.. 8 కోట్ల వ్యూస్ తో 100దేశాల్లో ఫాలోవర్లు ఉన్నట్లు వెల్లడించారు. అయితే తనకు ఆ స్థాయిలో ఫాలోవర్లు రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ట్వీట్ కారణమని టీచర్స్ డే సందర్భంగా వెల్లడించారు.

**ఒక్క నిర్ణయం ఖరీదు వందకోట్లు..** ఖాళీ జెర్సీతో టీమ్ ఇండియా డిజిటల్ కంటెంట్ ద్వారా పాఠాలు బోధిస్తున్న మంగారాణిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేశారు. మొత్తం 175 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయగా, వేదికపై మాట్లాడే అవకాశం మాత్రం కేవలం ఆరుగురికే దక్కింది. వీరిలో మంగారాణి మాట్లాడిన మాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సుమారు 1500 వీడియోలు చేసిన తాను 40,000 మంది సబ్ స్క్రైబర్లను సాధించడానికి చాలా కష్టపడ్డానని చెప్పారు. అయితే అలాంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన యూట్యూబ్ చానల్ ను అభినందిస్తూ ట్వీట్ చేయడంతో ఒకేసారి సబ్ స్క్రైబర్ల సంఖ్య 2.38 లక్షలకు చేరిందని చెప్పారు. అంతేకాకుండా చంద్రబాబు ట్వీట్ తో ప్రపంచం మొత్తంమీద తెలుగు ప్రజలు జీవిస్తున్న 100 దేశాల్లో తన చానల్ ఫాలో అవుతూ పిల్లలను చదవిస్తున్నారని, అదే సమయంలో తమ పాఠశాలకు విరాళాలిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

## అందరికీ ఆరోగ్య బీమా

స్పెషాలిటీ విభాగాల్లో 3,257 వ్యాధులకు చికిత్స

ఆస్పత్రులు : 2,493

ప్యాకేజీలు ఇలా : హైబ్రిడ్ మోడ్‌లోని 2,550 ప్యాకేజీలకు బీమా సౌకర్యం కల్పిస్తారు. వీటిలో ఎక్కువ మంది ఉపయోగించుకునే సాధారణ చికిత్సలు ఉంటాయి. 324 ప్యాకేజీలను పూర్తిగా ప్రభుత్వాసుపత్రులకే రిజర్వు చేశారు. వీటి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. 197 ప్యాకేజీల చికిత్సను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ పొందవచ్చు. ఈ ఖర్చునూ ప్రభుత్వం భరిస్తుంది. ఇందులో 166 అరుదుగా చేసే చికిత్సలు, ప్రభుత్వ పరిధిలో అందుబాటులో లేని 31 చికిత్సలు ఉంటాయి.

ప్రతి పేద కుటుంబానికీ రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం

వార్షిక బీమా కవరేజి : రూ.25 లక్షలు

లబ్ధి : 1.43 కోట్ల బీపీఎల్ కుటుంబాలకు

ప్రయోజనం : రూ.2.5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఖర్చు రూ.2.5 లక్షలు దాటితే రూ.25 లక్షల వరకు ఎంతైతే అంత బీమా కంపెనీలు చెల్లిస్తాయి. దాన్ని ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వారికి రీయింబర్స్ చేస్తారు.

ఉన్నతాదాయ వర్గాలకు ఏడాదికి రూ.2.5లక్షల వరకు

వార్షిక బీమా : రూ.2.5 లక్షల వరకు

లబ్ధి : 20 లక్షల ఉన్నతాదాయ (ఏపీఎల్) కుటుంబాలకు

ప్రయోజనం: బీమా కంపెనీ ద్వారా ఏడాదికి రూ.2.5 లక్షల వరకు నగదు రహిత సేవలు

రూ.25 లక్షల వరకూ ఉచిత చికిత్స – యూనివర్సల్ హెల్త్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం

నిశిత పర్యవేక్షణ – సమాచార భద్రత

జిల్లాస్థాయిలో వైద్యసేవల పర్యవేక్షణ, సమస్యల పరిష్కారం కోసం డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ (డీజీఆర్సీ) ఉంటుంది.

రియల్‌టైమ్ విధానం ద్వారా ముందస్తు అనుమతి, క్లెయిముల ప్రాసెసింగ్, లబ్ధిదారుల ధ్రువీకరణ జరుగుతుంది. రాష్ట్రస్థాయిలో క్లెయిమ్ రివ్యూ కమిటీ (సీఆర్‌సీ) ఉంటుంది. బీమా పరిహారం చెల్లింపులో సీఆర్‌సీ నిర్ణయమే అంతిమం. మోసాలు, లోపాలు, జాప్యాలకు జరిమానాలు విధిస్తారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆస్పత్రుల సస్పెన్షన్, గుర్తింపు తొలగించడం తదితర చర్యలు తీసుకుంటారు. పథకం అమలు తీరుపై 15 రోజులకు, నెలవారీగా సమీక్షలు ఉంటాయి. లబ్ధిదారుల సమాచారం బహిర్గతం కాకుండా నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ (ఎన్‌డీఏ) ప్రకారం చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం ఏటా ఎంతంటే? హైబ్రిడ్ మోడ్‌లో ప్రభుత్వం అమలుచేయనున్న అందరికీ ఆరోగ్యబీమా పథకం ద్వారా ఏటా ప్రభుత్వంపై రూ.641.07 కోట్ల ఆర్థికభారం పడుతుందని అంచనా. 2024–25లో గణాంకాలు పరిశీలిస్తే మొత్తం లబ్ధిదారుల్లో 12.15 లక్షల కుటుంబాలు (99.34%) రూ.2.50 లక్షల్లోపు ఖర్చుతో చికిత్సలు పొందారు. 8,042 కుటుంబాలకే రూ.2.50 లక్షల కంటే ఎక్కువ ఖర్చయింది. మొత్తంగా ఈ వైద్యానికి రూ.4,009 కోట్లు ఖర్చయిందని అంచనా. ఈ లెక్కన సాధారణ చికిత్సలకు బీమా వర్తింపజేసేందుకు రూ.301.58 కోట్లు, ఖరీదైన 521 వైద్యసేవలకు రూ.239.49 కోట్లు.. పరిపాలన ఖర్చులు రూ.100 కోట్లతో కలిపి మొత్తం రూ.641.07 కోట్లు వరకు ఆర్థికభారం ప్రభుత్వంపై పడుతుందని అంచనా.

## కోల్పోకుండా చూసుకోవాలి

అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 2025 చివర్లో ఈ కసరత్తు ప్రారంభించే అవకాశం ఉంది. బిహార్‌లో ఎస్‌ఐఆర్‌పై ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో దీన్ని మరింత పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆరా తీయనున్నారు. అక్రమ వలసదారులను తొలగించడంతోపాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా వివిధ చర్యలు తీసుకోనున్నారు. బంగ్లాదేశ్, మయన్మార్ అక్రమ వలసదారులపై వివిధ రాష్ట్రాల్లో చర్యలు తీసుకుంటున్న వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాలని! :** అయితే బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టే రాజ్యాంగబద్ధమైన అధికారం ఎన్నికల సంఘానికి ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసుకోవాలని సూచించింది. దేశంలోని చాలావరకు రాష్ట్రాలు 2002–04 మధ్యకాలంలో ఓటరు జాబితాల సమగ్ర సవరణ చేపట్టాయి. ఈ క్రమంలోనే ఇటీవల దిల్లీ, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల సీఈవోలు చివరిసారి ఎస్‌ఐఆర్ చేపట్టిన అనంతరం ప్రచురించిన ఓటర్ల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కాగా, బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ రాష్ట్రంలో ఎస్‌ఐఆర్ ముసాయిదా జాబితాను ఆగస్టు 1న ఈసీ విడుదల చేసింది. దీనిని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేయడంతోపాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని పేర్కొంది. అయితే సెప్టెంబర్ ఒకటి డెడ్‌లైన్‌ను పొడిగించాలంటూ దాఖలైన పిటిషన్లను విచారించింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఫిర్యాదుల విషయంలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేయాలని బిహార్ లీగల్ సర్వే అథారిటీకి ఆదేశాలు ఇచ్చింది. సెప్టెంబర్ 30 తర్వాత కూడా అభ్యంతరాలను స్వీకరిస్తామని, నామినేషన్ల దాఖలు చివరి తేదీవరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీంకు ఎన్నికల సంఘం తెలిపింది. ఇదే విషయాన్ని కోర్టు పిటిషనర్ల వద్ద ప్రస్తావించింది.

## సముద్రం 'అల'జడికి అడ్డుకట్ట!

ఈ ప్రాజెక్టు త్వరితగతిన పట్టాలెక్కనుంది. అలల తీవ్రతకు నేలమట్టం : బంగాళాఖాతంలో ఎప్పుడు అలజడి ఏర్పడినా విశాఖలో తీరం భారీగా కోతకు గురవుతోంది. భీమిలి నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకున్న ప్రాంతాలు దెబ్బతింటున్నాయి. అలల తీవ్రతకు బీచ్ రోడ్డులోని కొన్ని ప్రాంతాలు నేలమట్టమైపోతున్నాయి. అకస్మాత్తుగా సముద్రంలో కలిసిపోతున్నాయి. ఎప్పటికప్పుడు ఇదొక తీవ్ర సమస్యగా మారింది. అలాగే మత్స్యకార గ్రామాల్లో నివసించే ప్రజలకు ముప్పు వాటిల్లుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన చర్యలు ఆరంభించారు.

**ఇక్కడ ఎక్కువగా :** విశాఖ బీచ్ రోడ్డు తరచూ కోతకు గురవుతుంది. పెదవాల్తేరు వద్దున్న జాలరిపేట, జాలరి ఎండాడ, శివగణేష్‌నగర్, భీమిలి వద్ద మత్స్యకార గ్రామాల వద్ద తీరం కొట్టుకుపోతుంది. గోకుల్‌పార్క్, కురుసురా జలాంతర్గామి వద్ద తరచూ ముప్పు ఏర్పడుతోంది.

**డీపీఆర్‌కు ఆమోదం :** 'తీరంలో కోత నివారణకు తలపెట్టిన ప్రాజెక్టుకు అనుమతులు రానున్నాయి. ఇప్పటికే డీపీఆర్‌కు ఆమోదం లభించింది. హోంశాఖతో జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. అది పూర్తయిన వెంటనే పనుల ప్రారంభించేలా చర్యలు తీసుకోవచ్చు. నిధుల అంచనాకు ఆమోదం దక్కింది' అని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ పేర్కొన్నారు.

ఇదీ ఆలోచన :

నిర్మాణాలు : భీమిలి వద్ద మత్స్యకార బోట్లు వచ్చే ప్రదేశం, మంగమారిపేట, జాలారి ఎండాడ నుంచి శివగణేష్‌నగర్ వద్ద

రిటెన్షన్ గోడలు : భీమిలి బీచ్ రోడ్డు, తోట వీధి, ఆర్‌కే బీచ్ రోడ్డు ప్రాంతం గ్రోయిన్లు : గోకుల్‌పార్క్

ఇసుక మేటలు నింపడం : రుషికొండ, చేపల ఉప్పాడ ఇవి సమస్యలు : ఉమ్మడి విశాఖ తీరం పొడవు : 131 కి.మీ.

గత ఏడాది కోతకు గురైంది: 25.8 కి.మీ. పరిధిలో మత్స్యకార గ్రామాలు : 43 తరచూ కోతకు గురయ్యే గ్రామాలు : 15 తీరంలో చేపట్టే పనులకు ప్రతిపాదనలు ఇలా (రూ.కోట్లలో) నిర్మాణ పనులు : 160 నిర్మాణేతర పనులకు : 43

తీరంలో రక్షణ గోడల నిర్మాణం : 60 రిటెన్షన్ గోడలు: 40 షెల్టర్ బెల్టులు: 18 చైతన్య కార్యక్రమాలు: 5 గ్రోయిన్ల నిర్మాణం: 60 శిక్షణ అంశాలు: 4.50 ఇతర: 15.5 తీరం వెంబడి రోడ్లు – మారనున్న ఆ ప్రాంతాల రూపురేఖలు

2040 నాటికి తీరంలో ఐదు శాతం భూభాగం కోల్పోనున్న విశాఖ – నిపుణుల అంచనా


## ఎర్రకోటలో భారీ దొంగతనం

కలశంతో పాటు, వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలతో పొదిగిన 115 గ్రాముల మరో చిన్న బంగారు కలశం కనిపించలేదని వ్యాపారవేత్త సుధీర్ కుమార్ జైన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూజా కార్యక్రమానికి ప్రముఖులు హాజరవ్వడంతో తాము పక్కకు వెళ్లామని అంతలోనే ఈ దొంగతనం జరిగిందని పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఘటనా స్థలంలోని సీసీ కెమెరాను పరిశీలించారు. ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి పూజా సామగ్రి ఉన్న గదిలోకి వెళ్లి రెండు కలశాలను సంచిలో వేసుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. అనంతరం అతడు అక్కడి నుంచి బయటకు జారుకున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుడిపై ఇప్పటికే పలు ఆలయాల్లో దొంగతనానికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కలశాలను దొంగలిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పోలీసుల తెలిపిన ప్రకారం, వ్యాపారవేత్త సుధీర్ జైన్ రోజూ పూజ కోసం కలశం తీసుకువచ్చేవారు. గత మంగళవారం కూడా ఆయన కలశాన్ని తెచ్చారు. ఆ వేడుకలో లోక్‌సభా స్పీకర్ ఓం బిర్లా కూడా పాల్గొన్నారు. అయితే ఆగస్టు 15కు ముందు కూడా ఇక్కడ భద్రతా ఉల్లంఘన జరిగింది. అంతుకుముందు ఆగస్టు 2న, అక్కడి భద్రతా సిబ్బంది డమ్మీ బాంబును గుర్తించడంలో విఫలమయ్యారు. ఆ ఘటన తరువాత ఏడుగురు పోలీసులను సస్పెండ్ చేశారు. ఎర్రకోటలో స్వాంత్రత్య వేడుకలకు ముందు తీవ్ర భద్రతా వైఫల్యం బయటపడింది. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఎర్రకోటలో స్పెషల్ డ్రిల్ నిర్వహించినట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. అందులోభాగంగా కొందరు భద్రతాధికారులు సాధారణ వ్యక్తుల్లా డమ్మీ బాంబుతో ఎర్రకోటలోకి ప్రవేశించారు. అయితే, అక్కడ విధుల్లో ఉన్న అధికారులు ఆ డమ్మీ బాంబును గుర్తించడంలో విఫలమయ్యారు. దీంతో వారిని సస్పెండ్ చేశారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎర్రకోట వద్ద భద్రతను పూర్తిస్థాయిలో సమీక్షించి, కట్టుదిట్టం చేశారు. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో పనిచేసే ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిఘాను పటిష్ఠం చేశారు. సీనియర్ అధికారులు, స్వాట్ బృందాలతో రెండంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ ఘటనతో దిల్లీ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్‌ను ముమ్మరం చేసి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## పెద్ద ప్లానింగే..?

చెబుతున్నారు. ప్రధాని మోదీతో మంత్రి లోకేశ్ భేటీ కావడం ఇది రెండో సారి. ప్రధాని ఆహ్వానం మేరకు గత మే నెలలో ఒకసారి లోకేశ్ కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లి ప్రధానితో సుదీర్ఘంగా చర్చించారు. శుక్రవారం కూడా రాష్ట్ర సమస్యలపై చర్చించేందుకంటూ ఢిల్లీ వెళ్లిన మంత్రి లోకేశ్ ప్రధానితో దాదాపు 45 నిమిషాల పాటు భేటీ అయ్యారు. బిజీ షెడ్యూల్ లో కూడా ప్రధాని మోదీ మంత్రి లోకేశ్ తో అంత సమయం గడపడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రానికి నిధుల సాధనే లక్ష్యంగా లోకేశ్ ఢిల్లీ పర్యటలు ఉంటున్నట్లు టీడీపీ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. అయితే ఒక సాధారణ మంత్రిగా ఉన్న లోకేశ్ కు ఢిల్లీలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతోపాటు ఇతర కేంద్ర మంత్రులు ప్రాధాన్యం ఇవ్వడం చిన్న విషయమేమీ కాదంటున్నారు. టీడీపీ భావి నేత లోకేశ్ ను మచ్చిక చేసుకోడానికే బీజేపీ పెద్దలు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో బీజేపీతో బలమైన బంధం కొనసాగించేందుకు టీడీపీ కూడా సానుకూలంగా ఉన్నట్లు సంకేతాలిస్తోందని అంటున్నారు. వాస్తవానికి మంత్రి లోకేశ్ ను ప్రధాని మోదీయే ముందుగా ఢిల్లీ రమ్మని ఆహ్వానించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వచ్చిన ప్రధాని మోదీ, ఢిల్లీ వచ్చి తనను కలవాల్సిందిగా మంత్రి లోకేశ్ ను ఆహ్వానించారు. అయితే ప్రధాని పిలిచినా లోకేశ్ వెళ్లకపోవడంతో గత మే నెలలో అమరావతి పనులు పునఃప్రారంభానికి వచ్చిన ప్రధాని మోదీ ఈ విషయంపై చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తున్నట్లు బహిరంగ వేదికపైనే చెప్పారు. దీంతో అదే నెలలో మంత్రి లోకేశ్ తన భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ తో కలిసి ఢిల్లీ వెళ్లి ప్రధానితో భేటీ అయ్యారు. అప్పట్లో దాదాపు గంటకు పైగా ప్రధాని నివాసంలో గడిపిన లోకేశ్.. రాష్ట్ర రాజకీయాలు, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రధానితో చర్చించారని అంటున్నారు. చిన్న వయసులోనే లోకేశ్ ఎంతో అవగాహన పెంచుకున్నారని భావించిన ప్రధాని మోదీ అప్పటివరకు లోకేశ్ పై ఉన్న అభిప్రాయాన్ని సవరించుకున్నారని అంటున్నారు. ఈ విషయంపై తన సహచరుల వద్ద కూడా చర్చ జరిగిందని, టీడీపీకి ఏపీకి లోకేశ్ భావి నాయకుడిగా వారు గుర్తించారని అంటున్నారు. అందుకే హోదా ప్రకారం లోకేశ్ రాష్ట్ర మంత్రి అయినప్పటికీ, ఆయనకు రాష్ట్ర ప్రతినిధిగానే పరిగణిస్తున్నారని చెబుతున్నారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బీజేపీ అధిష్టానంతో మెరుగైన సంబంధాలను ఆశిస్తూ ఆ పార్టీ నేతలు అందరితోనూ లోకేశ్ కు పరిచయాలు పెరిగేలా వ్యూహం రచించారని అంటున్నారు. అందుకే ఢిల్లీ పర్యటనలకు తాను దూరంగా ఉంటూ, లోకేశ్ ద్వారా రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై మంత్రాంగం నడుపుతున్నారని అంటున్నారు. దీనివల్ల రాజకీయంగా లోకేశ్ కు మరింత అనుభవం వచ్చే అవకాశంతోపాటు ప్రజల్లో కూడా లోకేశ్ సామర్థ్యంపై నమ్మకం పెరుగుతుందని ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా లోకేశ్ ఢిల్లీ పర్యటన ఉభయ పార్టీలకు లాభదాయకంగా కనిపిస్తుండటంతో ఆయనకు ఢిల్లీలో రానురాను ప్రాధాన్యం పెరుగుతోందని అంటున్నారు.

## 50 రోజుల తర్వాత
## 5 రోజుల ఉపశమనం



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** వైసీపీ నేత, ఆ పార్టీ లోక్ సభాపక్ష నేత పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి ఏసీబీ కోర్టులో ఊరట దక్కింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తూ మిథున్ రెడ్డికి మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. రెగ్యులర్ బెయిలు పిటిషన్ తిరస్కరించిన కోర్టు రాజ్యాంగం కల్పించిన హక్కును అడ్డుకోకూడదనే ఉద్దేశంతో మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. ఈ నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసిన అనంతరం తిరిగి 11వ తేదీన లొంగిపోవాలని కోర్టు ఆదేశాలిచ్చింది. దారుణం వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి లిక్కర్ కేసులో ఏ4గా అభియోగాలు ఎదుర్కొంటున్నారు. జులై 19న సిట్ విచారణకు వెళ్లిన ఆయనను అదే రోజు అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అంతకు ముందు సుప్రీంకోర్టు రక్షణతో కొన్నాళ్లు అరెస్టు నుంచి తప్పించుకున్న మిథున్ రెడ్డి.. ఆ తర్వాత సిట్ వాదనలతో సర్వోన్నత న్యాయస్థానంలో ఊరట దక్కించుకోలేకపోయారు. దీంతో జులై 19 అరెస్టు అయ్యారు. అప్పటి నుంచి సుమారు 50 రోజులుగా ఆయన జైలులోనే ఉన్నారు. విచారణ కోర్టు అయిన ఏసీబీ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు బెయిలు కోసం ప్రయత్నిస్తున్నా, ఇంతవరకు ఎంపీ మిథున్ రెడ్డికి రిలీఫ్ దక్కలేదు. రెగ్యులర్ బెయిలు కోసం చేస్తున్న ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. స్కాంలో ఆయన పాత్రపై చార్జిషీటు వేయాల్సివుండటంతో ఎంపీ మిథున్ రెడ్డికి బెయిలు ఇవ్వొద్దని సిట్ వాదిస్తూ వస్తోంది. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నికలు ఉండటం, ఎంపీగా ఉన్న మిథున్ రెడ్డి ఓటు వేయాల్సివున్నందున కనీసం మధ్యంతర బెయిలు అయినా ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## ఎరువుల దుకాణాలపై
# విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు



**కొండిపి, ప్రజలకి చేరువ ప్రతినిధి :** ఒంగోలు విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విజిలెన్స్ సీఐ రాఘవరావు, విజిలెన్స్ ఏవో శివ నాగ ప్రసాద్ వారి ఆధ్వర్యం లో కొండపి మండలం పరిధిలోని ప్రైవేటు ఎరువులు దుకాణాల పై ఆకస్మిక తనిఖీలు చేసారు.మొదటగా వెంకట దివ్య ట్రేడర్ షాపులో ఎరువులు, ధరల పట్టికను ,ఈ పాస్ మెషిన్ లో స్టాక్ కి గోడౌన్ లోని స్టాక్ ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. వెంకట హనుమన్ ట్రేడర్స్ షాప్ లో నిల్వ ఉంచిన స్టాక్ కి ఈ పాస్ మెషిన్ నందు నమోదు చేయకపోవడం వలన ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ రకం 12.0 మెట్రిక్ టన్నులు ఎరువులను 312,000 విలువ గల వాటిని తాత్కాలికంగా అమ్మకాని నిలిపివేసారు,వెంకట హనుమన్ ఫెర్టిలైజర్స్ షాప్ నందు నిలువ ఉన్న ఎరువులకు సరైనా ఫారం లే నందున 20:20:0:13 రకం 6.75 మెట్రిక్ టన్నుల ఎరువులను 175500 విలువ గల వాటిని తాత్కాలికంగా అమ్మకాన్ని నిలిపి వేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి తెలిపారు.అలాగే ఎరువుల అమ్మే షాప్ వాళ్ళు అందరూ ధరల పట్టికను ప్రతి రోజు అప్డేట్ చేయాలని, స్టాక్ రిజిస్టర్, ఈ పాస్ మెషిన్ నందు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని చెప్పారు. రైతులు అందరు కొనే ప్రతి ఎరువు బస్తా కి రసీదు తీసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, ఏ ఈ ఓ పాల్గొన్నారు.

## యానాదుల గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్
# దృష్టికి ప్రత్యేక సమస్యలు



**కందుకూరు ప్రజలకి చేరువ ప్రతినిధి :** నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన యానాదుల ప్రత్యేక గ్రీవెన్స్ లో సబ్కార దృష్టికి ప్రత్యేక సమస్యలను తీసుకువచ్చారు.దివివారి పాలెం లో ఉన్న ఎస్టీ కాలనీ కి సంబంధించి స్మశానం ఆక్రమణ, పాలూరు పంచాయతీ మదన గోపాల పురానికి సంబంధించి వేణుగోపాల స్వామి గుడి కి సంబంధించిన పొలం యానాదులకి కొంతమేర రిజర్వేషన్ చేసి మిగిలిన పొలాన్ని మాత్రమే వేలంలో చూపిస్తామని చెప్పిన దేవాదాయ శాఖ అధికారులు కానీ పూర్తిగా పొలాన్ని వేలంలో ప్రకటించడం వల్ల ఒక్క సెంటు భూమి కూడా యానాదులకి దక్కలేదనీ, కందుకూరు నియోజకవర్గం మొత్తం మీద ఉన్న యానాది సంఘాలకు సంబంధించి స్మశాన స్థలాలను రక్షించి వాటికి హద్దులు వేసి ఇవ్వవలని, గుడ్లూరు పట్టణం లో శివాలయం సంఘంలో అంగన్వాడి టీచర్ కి సంబంధించి అదే గ్రామానికి సంబంధించిన మహిళకి కాకుండా వేరే పంచాయతీలో ఉన్న అగ్ర కులస్తులైన వారికి అక్రమంగా ఆ పోస్టు ఇస్తున్నటువంటి ఐసిడిఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, కరేడు భూ సమస్యలు, గని గుంట గ్రామంలో కమ్యూనిటీ హాల్ , ఆధార్ కార్డులు రేషన్ కార్డులు ఇళ్ల స్థలాల పై పలు అర్జీలు సమర్పించారు .ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా చైర్మన్ రాపూరి కృష్ణయ్య, ప్రకాశం జిల్లా అధ్యక్షులు కొమరగిరి మాల్యాద్రి, ఉపాధ్యక్షులు చేవూరి దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలు మల్లవరపు సీతా నాయకులు పాల్గొన్నారు.

## మధురవాడ రోడ్డు విస్తరణ
# పనుల్లో ఉద్రిక్తత

**వైఎస్సార్సీపీ నేత భవనం పోర్టుకో, ప్రహరీ తొలగింపు**
**అడ్డు వచ్చిన వారిని ఈడ్చి పడేశాలు**





**మధురవాడ:** రోడ్డు విస్తరణ పనుల్లో మధురవాడలో తీవ్ర ఉద్రిక్తతం ఏర్పడింది. ఇందులో వైఎస్సార్సీపీ నాయకుడు ఇల్లు కావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మధురవాడ జోన్ జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద నివాసం ఉంటున్న వైఎస్సార్సీపీ 5వ వార్డు అధ్యక్షుడు, మాజీ కార్పోరేటర్ పోతిన హనుమంతురావు కుటుంభ సభ్యులు ఇంటిపై అన్ని విభాగాలు అధికారులు మూకుమ్మడి దాడికి శనివారం ఉదయం దిగారు. పూర్తిగా తెల్లారక ముందే జీవీఎంసీ, ఉడా అధికారులు పోలీసు బెటాలియన్ ఇంటి వద్ద మొహరించారు. వారికి ఎటుంటి నోటీసు ఇవ్వకుండా, కోర్టు గైడైలెన్స్ను, కుటుంభ సభ్యులు అభ్యంతరాల్ని కూడా ఏమాత్రం పట్టించుకోకుండా ఇంటి ప్రహరీ, పోర్టుకోను డీసీపీ హరిదాసు, ఏసీపీ షబ్నాన్ శాస్త్రి, టీపీవో శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది కూల గొట్టారని కుటుంభ సభ్యులు అన్నారు. అబ్యంతరం తెలిపిన వారిని ఆడ, మగ తేడా లేకుండా మెట్లుపై నుంచే ఈడ్చి పడేశారు. పోలీసు జీవుల్లో కుక్కేసి సీఐ బాలకృష్ణ, ఎస్ఐలు రాము. బాస్కరరావులు ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్కి తరలించారు.

కుటుంభ సభ్యులు సురేష్, జగదీష్, కాశి విశ్వనాద్, సంజీవ రావు ఇతర కుటుంభ సభ్యులు మాట్లాడుతూ తమ ఇంటి స్థలాన్ని జాయింట్ సర్వే చేయించి టీడీఆర్ ఇచ్చి స్థలాన్ని మార్కింగ్ చేసి ఇస్తే తమ స్వంత ఖర్చులతో కాల్వ నిర్మాణం చేసి ఇస్తామన్నా అధికారులు సహకరించలేదన్నారు. తమ భవనం అడ్డు ఉన్నట్టు బైట ప్రపంచానికి చూపిండానికి ఇక్కడ కాల్వలు వంకరలు తిప్పారన్నారు. తమ కుటుంభాన్ని అబాసు పాలు చేయడానికి ప్రయత్నించడం. సరికాదన్నారు. రాజకీయ కక్షతో తమను టార్గెట్ చేశారని వాపోయారు. కనీసం తమ వాదనను ఏమాత్రం పట్టించుకోపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎంపాలెం పోలీసులుతో పాటు రిజర్వ్ పోలీసులు సుమారు 30మంది వరకు ఇంటి వద్ద మోహరించి అబ్యంతరం తెలిపిన మహిళలను కూడా మెట్లు మీద నుంచి లాగేసే ప్రయత్నం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుల తీరును స్థానికులు కూడా తప్పు పట్టారు. మధురవాడలో ఎన్నో రోడ్లు వదిలేసి ఈ రోడ్డుపైనే అంత మమకారం ఏమిటని ప్రశ్నించారు.

**జీవీఎంసీ విషన్లకు అనధికార కరెంటు :**
జీవీఎంసీ అధికారులు భవనం పోర్టుకో తొలగింపు పక్కనే గాయత్రి క్లినిక్, టీ టైం. సెల్ షాపుల వద్ద నుంచి అనధికార కరెంటును ఉపయోగిండం వివర్శలకు తావిచ్చింది. వీరు అడుగడునా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న విమర్శలు గుప్పుమన్నాయి.

## నేడు పోలేరమ్మ
# ఆలయం మూసివేత



**ప్రజలకి చేరువ ప్రతినిధి :** అమావాస్య సందర్భంగా కామేపల్లిలోని పోలేరమ్మ అమ్మవారి గుడి మూసి వేస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి తెలిపారు. ఆదివారం అమావాస్య తో పాటు సంపూర్ణ చంద్రగ్రహణం కావున ఆరోజు అర్చక స్వామి సూచన మేరకు శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవాలయం మధ్యాహ్నం 2గంటలకి దర్శనం నిలిపి ఆలయం మూసి వేయబడునని , మరుసటి రోజు ఉదయం సోమవారం అమ్మవారికి సంప్రోక్షణ అనంతరం యదావిధిగా గా దర్శనం ఎర్పాటు ఉంటుందనీ భక్తులు ఈ విషయం గమనించి ఆలయ కమిటీకి సహకరించాలని కార్యనిర్వాహణాధికారి కోరారు.

## నేడే వైసీపీ
# పోస్టర్ ఆవిష్కరణ

**పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలి**
**వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్**



**కనిగిరి, ప్రజలకు చేరువ ప్రతినిధి**
ఈనెల 9వ తేదీ వైఎస్ఆర్ కాంగ్రెస్ అదినాయకత్వం తల పెట్టిన రైతుబాసటగా కార్యక్రమానికి సంబందించి నేడు అనగా ఆదివారం పోస్టర్ కార్యక్రమం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో ఉదయం 9:00 గంటలకు జరుగుతుందని కనిగిరి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్,కౌన్సిల్లర్లు, కో-ఆప్షన్ సభ్యులు,మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు,జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు,రాష్ట్ర, జిల్లా మరియు నియోజకవర్గం వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, గ్రామపార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, పార్టీ అభిమానులు అందరూ ఈ కార్యక్రమం లో పాల్గొనవలని ఆయన కోరారు.

## అత్యవసర అంబులెన్స్‌ను
## ప్రారంభించిన డాక్టర్ శకుంతల



**కందుకూరు, ప్రజలకు చేరువ ప్రతినిధి :** కొత్త అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ 108 అంబులెన్సును రీజనల్ మేనేజర్ విజయ్ కుమార్ సూచనల మేరకు ఏరియా ఆసుపత్రి సూపరడెంట్ డాక్టర్ శకుంతల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో కొత్త అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సు ను కందుకూరు డివిజన్‌కి ఇవ్వడం జరిగిందన్నారు. అత్యవసర సమయంలో 108 అంబులెన్సుని ప్రజలు వినియోగించుకో వలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ వెహికల్ సూపర్వైజర్ ప్రభాకర్, డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ హరిబాబు, ఆస్పత్రి సిబ్బంది,108 సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలలను
# ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గం

**కనిగిరి వైయస్ఆర్‌సీపీ కనిగిరి ఇంచార్జి దద్దాల**



**కనిగిరి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపారమైన అనుభవం ఉందని చెప్పే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 15 ఏళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ అయినా తెచ్చారా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక రంగాలను ప్రవేటీకరిస్తోందని, అదేవిధంగా కమీషన్ల కోసమే పీపీపీ పద్ధతిలో 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించేందుకు క్యాబినెట్ లో నిర్ణయం తీసుకుందని ఆయన మండిపడ్డారు.దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేదవాడికి ఆరోగ్య భద్రత కల్పించాలని, పేదవాడికి అందని ద్రాక్షగా ఉన్న వైద్య విద్యను దగ్గర చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్రంలో సుమారు 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు.కూటమి ప్రభుత్వం జగన్ కు మంచి పేరు వస్తుందనే ఉద్యేశంతో మెడికల్ కాలేజీలను ప్రవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మెడికల్ కాలేజీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ ఏడాదిన్నర కాలంలో పనులు నత్తనడకన నడుస్తున్నాయని ధ్వజమెత్తారు.2019 ముందు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం 1054 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తే వైయస్ ఆర్‌సీపీ జగనన్న పాలనలో 3,257 వ్యాధులకు దానిని విస్తరించిదన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో కేవలం 1,000 ఆస్పత్రిల్లో మాత్రమే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తే జగన్ ఆధ్వర్యంలో సుమారు 2,350 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అందించినట్ల విస్తరించిదన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో కేవలం 1,000 ఆస్పత్రిల్లో మాత్రమే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తే జగన్ ఆధ్వర్యంలో సుమారు 2,350 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అందించినట్లు తెలిపారు. కరోనకు కూడా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అందించినట్లు చెప్పారు. జగన్ 45 లక్షల మంది లబ్ధిదారులకు రూ.13 వేల కోట్లు వెచ్చించి వైద్యం, రూ.1,500 కోట్ల ఆర్థిక ఆసరా అందించారన్నారు. బాబు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 5 లక్షల వరకు మాత్రమే ఆ లబ్ధి ఇచ్చేదని, వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఆలబ్ధిని రూ. 25 లక్షలకు పెంచిందని గుర్తు చేసారు.ఈ రోజు వైద్య విద్యను పేదలకు దూరం చేయాలనే దురుద్దేశంతోనే ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలని భావించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ విధానం మార్చుకోకపోతే యువతతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

## ఫిరోజ్‌కు టిడిపి శ్రేణులు
# శుభాభినందనలు

**ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఫిరోజ్**



**కనిగిరి ప్రజలకు చేరువ ప్రతినిధి :** తెలుగుదేశం పార్టీ కనిగిరి టౌన్ అధ్యక్షులుగా నియమితులైన షేక్ ఫిరోజ్ కు కనిగిరిపట్టణ టిడిపి శ్రేణులు శనివారం ఆయనను కలిసి శుభాభినందనలు తెలిపారు. ఆయన మరెన్నో పదవులుపొందాలని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాదుతూ కనిగిరి ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. తనకు కనిగిరి టౌన్ అధ్యక్ష పదివి రావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# త్రాగు నీరు, వీధి దీపాలు - రెండు సమస్యలను పరిష్కరిస్తాం

**జిల్లా ఇన్ఛార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**



**విశాఖపట్నం, ప్రజలకు చేరువ ప్రతినిధి :** సెప్టెంబర్ 6 : త్రాగు నీరు , వీధి దీపాలు సమస్యలపై డి ఆర్ సి సమావేశం లో చర్చించడం జరిగిందని త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం డి ఆర్ సి సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీసీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, కలెక్టరేట్ లో డి ఆర్ సి సమావేశం నిర్వహించామని, గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు పరిష్కరించామని అన్నారు.త్రాగు నీరు సమస్య, వీధి దీపాలు సమస్య పై ఈ సమావేశం లో చర్చించామని, రెండు సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వేసవి లో త్రాగునీటి సమస్య లేకుండా నీటిని నిల్వ చేసుకునే ట్యాంకుల కెపాసిటీ పెంచాలని నిర్ణయించామన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ నుంచి వచ్చే నీటిని రిజర్వ్ చేసుకునేందుకు వీలుగా అదనంగా కొన్ని ట్యాంకర్లను గుర్తించడం జరిగిందన్నారు. చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టిడ్కో ఇల్లు సమస్య పై అసెంబ్లీ సమావేశాల సమయంలో సంబంధిత శాఖల ముఖ్య అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని తీర్మానం చేసామన్నారు. సచివాలయాలలో ప్రింటర్స్ కొరత ఉన్నట్లుగా డి ఆర్ సి సమావేశంలో చర్చకు వచ్చిందని, అందుకు సంబంధించి టెండర్స్ ని పిలవడం జరిగిందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్లే విషయంలో సమస్యలు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, పోర్ట్, నేవల్, డాక్ యార్డ్ తదితర సంస్థల అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధి విషయంలో మోనిటరింగ్ చేయడం జరుగుతుందన్నారు. పారిశుధ్య కార్మికులు తక్కువుగా ఉన్నందున తాత్కాలిక పద్ధతిలో సిబ్బందిని తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. విశాఖ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, దీనిని ఆర్థికంగానూ, ఉపాధి కల్పించే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని, టూరిజంతో పాటు క్లీన్ అండ్ గ్రీన్ తోపాటు సౌకర్యాలు పెంచాలని ఈ సమావేశంలో తీర్మానించామని తెలిపారు. జిఓ నెం.30 మరియు 45 విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించడం జరిగిందన్నారు. దీపం-2 పథకంలో లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖ నగర అభివృద్ధి కి అధికారులకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పోలవరంలో నీటిని నవంబర్ కు అనకాపల్లి వరకు తీసుకొస్తామని తెలిపారు. విశాఖ అభివృద్ధి పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. శాసనసభ్యులు విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ, గత డి ఆర్ సి సమావేశంలో లేవనెత్తిన సమస్యలను జిల్లా ఇన్చార్ మంత్రి పరిష్కరించారని అన్నారు. సమీక్ష సమావేశాలు జరిగితే సమస్యలు పరిస్కారం అవుతాయని పేర్కొన్నారు. ఈ పత్రికా ప్రతినిధుల సమావేశంలో డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పాల్గొన్నారు.



సమంత రూత్ ప్రభు ప్రతి సారి తన స్టైల్‌తో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు కూడా అదే రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. బ్లాక్ అండ్ వైట్ గౌన్‌లో కూల్ లుక్‌తో కనిపించిన సమంత, సింపుల్‌గా ఉన్నా స్టైలిష్‌గా నిలిచింది. మేకప్ మినిమల్‌గా, హెయిర్ లూజ్‌గా వదిలేసుకోవడం ఈ లుక్‌ను మరింత సహజంగా చూపించింది. సమంత కెరీర్ గురించి చెప్పాలంటే, 2010లో ఏ మాయ చేసావే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత దూకుడు, ఈగ, అత్తారింటికి దారేది, రంగస్థలం వంటి బ్లాక్‌బస్టర్‌లతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగుతో పాటు తమిళంలోనూ అగ్రశ్రేణి నటిగా

## బ్లాక్ అండ్ వైట్ లుక్స్‌లో సామ్

తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా ది ఫ్యామిలీ మాన్ 2 వెబ్ సిరీస్‌లో చేసిన పాత్ర ఆమెకు కొత్త గుర్తింపు తెచ్చిపెట్టింది. నిర్మాత రాజీవ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు ఇటీవలి కాలంలో ఆరోగ్య సమస్యల కారణంగా సినిమాలకు కొంత విరామం తీసుకున్నా, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంటుంది. తన ప్రయాణం, వర్కౌట్ క్లిప్స్, వ్యక్తిగత ఆలోచనలను షేర్ చేస్తూ అభిమానులతో అనుబంధం కొనసాగిస్తోంది. ఈ ఫోటోషూట్ కూడా ఆమె ఫ్యాషన్ సెన్స్, లైఫ్ స్టైల్‌పై ఉన్న క్లాస్‌ని మరోసారి చూపించింది. ఇక సమంత ప్రస్తుతం కొన్ని కీలక ప్రాజెక్ట్‌లలో నటిస్తోంది. శాకుంతలం తర్వాత ఆమె చేసిన ప్రయోగాలు మిశ్రమ స్పందన తెచ్చుకున్నా, రాబోయే చిత్రాలపై ఇంకా మంచి అంచనాలున్నాయి. బాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లపై కూడా ఆమె దృష్టి పెట్టింది.



## ఒడిశాలో అనుష్క కోసం పోలీసులు లాఠీఛార్జ్!

తెలుగు రాష్ట్రాల్లో స్వీటీ అనుష్క పై అభిమానం ఏ రేంజ్ లో ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. కోట్లాది మంది అభిమానించే తార. సావిత్రి, శ్రీదేవి, విజయశాంతి, సౌందర్య తరహాలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది. హీరోయిన్ గానే కాకుండా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనూ సోలోగానూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటిన నటి. బాహుబలి సినిమాతో పాన్ ఇండియాలోనూ గుర్తింపు దక్కించుకుంది. తెలుగు రాష్ట్రాల్లో అనుష్క ఫిలిం సర్కిల్ దాటి వచ్చిందంటే? సెల్ఫీలంటూ ఎగబడేది ఎంతోమంది. %ూశ్రీంశీ =ఖుం% – బ్లాక్ అండ్ వైట్ లుక్స్‌లో సామ్ మెస్మరైజ్ ఆమె పక్కన నుంచుకోవాలని..ఓ సెల్ఫీ దిగాలని ఆశపడే వారెంతో మంది. తాజాగా ఇదే స్థాయి అభిమానం అనుష్క ఒడిశా నుంచి కూడా చూసిందని వెలుగులోకి వచ్చింది. ఈ విషయా న్నిస్వయంగా నిర్మాత రాజీవ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం అనుష్క ప్రధాన పాత్రలో క్రిష్ చిత్రా న్నితెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఒడిశాలో జరిగిన ఓ యదార్ధ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ చాలా బాగం ఒడిశాలోనే జరిగింది. అనుష్కకు సంబంధించిన సన్నివేశాలన్నీ అక్కడే కీలకంగా చిత్రీకరించారు. చాలా వరకూ షూట్ ఒడిశా కొండగుట్టల్లో షూట్ చేసారు. అయితే షూటింగ్ ఆ ప్రాంతంలో జరుగుతుందని తెలుసుకుని ఒడిసా వాసలు తండోపతండాలు గా తరలి వచ్చారని రాజీవ్ రెడ్డి తెలిపారు.వేలాదిమంది అభిమానులు తరలి రావడంతో ఓ సందర్భంలో భద్రత కారాణాల దృష్ట్యా పోలీసులు లాఠీ ఛార్జ్ కూడా చేసారన్నారు. అక్కడ ఇలాంటి ఘటన జరుగుతుందని ఏమాత్రం ఊహించలేదన్నారు. ఒడిశాలో అనుష్కకు అభిమానులు ఎవరుంటరాని అనుకున్నాను. కానీ తరలి వచ్చిన జనంతో అనుష్క ఏ స్థాయికి ఎదిగింద న్నది మరోసారి అర్ధమైందన్నారు.నిర్మాత అలాగే ఘాటీ రిలీజ్ కి ఇంకా పది రోజులే సమయం ఉంది. ప్రచారంలో అనుష్క కనిపించలేదేంటని ప్రశ్నిస్తే? రాజీవ్ రెడ్డి దీనిపై కూడా క్లారిటీ ఇచ్చారు. ప్రమోషన్ పరంగా అనుష్కకు-తమకు ఓ అవగాహన, క్లారిటీ ఉందన్నారు. ప్రచార పరంగా అనుష్క పాత్రని ముందే తమకు చెప్పారన్నారు. ఆమె నిర్ణయాన్ని తాము అంతే గౌరవించి ముందుకెళ్తున్నట్లు తెలిపారు. దీంతో ఈసినిమా ప్రమోషన్ లో అనుష్క ఎక్కడా కనిపించే అవకాశం లేదని తెలుస్తోంది.

## 'లెనిన్'లో లగెత్తించే భామ



అక్కినేని వారసుడు అఖిల్ కథానాయకుడిగా మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో లెనిన్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. అక్కినేని వారసుడు అఖిల్ కథానాయకుడిగా మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో లెనిన్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న పీరియాడిక్ చిత్రమిది. అఖిల్ తొలిసారి రాయలసీమ మాండలికం మాట్లాడబోతున్నాడు. ఆ పాత్రకు సంబంధించి కొంత ట్రైనింగ్ కూడా తీసుకున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన గ్లింప్స్ తో అఖిల్ పై ఓ వైబ్ క్రియేట్ అయింది. మునుపటి చిత్రాల కంటే భిన్నమైన రోల్ కావడంతో? కమర్షియల్ గా వర్కౌట్ అవుతుందనే అంచనాలు బలంగా ఉన్నాయి. భారీ యాక్షన్ కం ఫ్యామిలీ స్టోరీనే మురళీ వైవిధ్యంగా చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. అలాగని కమర్షి యల్ అంశాలను ఎంత మాత్రం దూరం పెట్టడం లేదు. కథకు అసవరమైన నవరసాలు సినిమాలో ఉండబోతున్నాయని చిత్ర వర్గాల నుంచి గట్టిగానే వినిపిస్తోంది. ఇందులో అఖిల్ కి జోడీగా భాగ్య శ్రీ బోర్సే నటిస్తోంది. ఆమె పాత్రను గ్లామర్ పరంగా హైలైట్ అయ్యేలా చూస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కుర్రకారును హీటెక్కించే మాంచి మాస్ నెంబర్ ఒకటి డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముంబైకి వెళ్లాల్సిన పనిలేదు: ఆ పాట బాధ్యతలు ఫేమస్ గాయని మంగ్లీకి అప్పగించారట. యువతకు కనెక్ట్ అయ్యే పదాలతో మంగ్లీ గానంతో కుర్రాళ్లకు కిక్కె క్కించేలా ట్యూన్ కూడా సిద్దమైందని తెలిసింది. అయితే ఆ పాటలో నర్తించే భామ ఎవరు? అన్నదే కీలకంగా మారింది. మేకర్స్ ఓ స్టార్ హీరోయిన్ నే రంగంలోకి దించాలనుకుంటు న్నారట. మరి ఆ ఛాన్స్ ఎవరు అందుకుంటారో చూడాలి. స్టార్ హీరోల చిత్రాల్లో ఐటం పాటలంటే? కొంత కాలంగా పేరున్న భామలే ఆడిపాడుతోన్న సంగతి తెలిసిందే. ముంబై నుంచి ప్రత్యేకంగా నర్తకీలను దించాల్సిన పనిలేదు. ప్రస్తుతం సమంత, శ్రీలీల, పూజాహెగ్డే లాంటి భామలు ఐటం పాటలతో బాగా ఫేమస్ అయిన వారు. కాస్త ఓల్డ్ భామల వైపు చూడాలంటే కాజల్ అగర్వాల్, తమన్నా, శ్రియ లాంటి వారిని టచ్ చేయొచ్చు.

## గ్లామర్‌తో పిచ్చెక్కిస్తున్న వేదిక



ఈ మధ్యకాలంలో సినిమాల కంటే సోషల్ మీడియా ద్వారానే సెలబ్రిటీలు భారీ పాపులారిటీ సొంతం చేసుకుంటున్నారు.. అటు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ముఖ్యంగా ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడ్డ చాలా మంది హీరోయిన్స్ భిన్నవిభిన్నమైన దుస్తులు ధరించి, తమ గ్లామర్ తో అభిమానులకు చెమటలు పట్టిస్తున్నారని చెప్పవచ్చు. అటు దర్శక నిర్మాతలు కూడా సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ఎక్కువ ఉన్న వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు ప్రముఖ బ్యూటీ వేదిక కూడా ఏకంగా బ్లాక్ అవుట్ ఫిట్ లో బ్యాక్ అందాలు చూపిస్తూ యువతకు నిద్ర లేకుండా చేస్తోంది. గ్లామర్ తో పిచ్చెక్కిస్తున్న వేదిక.. వేదిక షేర్ చేసిన ఇంస్టాగ్రామ్ ఫోటోల విషయానికొస్తే.. బ్లాక్ కలర్ డీప్ వీ నెక్ కలిగిన డ్రెస్ ధరించిన ఈమె.. ఒకవైపు సైడ్ యాంగిల్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది. ముఖ్యంగా వెనక వీపు భాగంలో పూసలతో డిజైన్ చేశారు. ఇది ఈమె అందాన్ని మరింత హైలెట్ చేస్తోందని చెప్పవచ్చు. అటు పింక్ కలర్ ఫ్లవర్స్ తో ఆ బ్లాక్ డ్రెస్ కి స్ట్రాప్ రెడీ చేసి చాలా అందంగా డిజైన్ చేశారు.. ఈ ఫోటోలలో వేదిక గ్లామర్ లుక్ తో ప్రేక్షకులను కట్టిపడేస్తోంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఈ ఫోటోలు చూసిన నెటిజన్స్ కూడా పలు రకాల కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా వేదిక లుక్ ఫాలోవర్స్ లో మరింత హీట్ పెంచుతోంది అనడంలో సందేహం లేదు.

వేదిక బాల్యం , విద్యాభ్యాసం.. 1983 ఫిబ్రవరి 21న మహారాష్ట్రలోని సోలాపూర్ లో జన్మించింది. ఈమె పూర్తి పేరు వేదిక పూజా కుమార్. ముంబైలో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన ఈమె.. యూనియన్ లండన్ లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లో ఎంఎస్సీ పూర్తి చేసింది. వేదిక సినీ ప్రయాణం.. చిన్నప్పుడే భరతనాట్యం నేర్చుకున్న వేదిక కాలేజ్ చదువుకునే సమయంలోనే ఒక వీడియో ఆల్బమ్ కూడా చేసింది.. ఆ ఆల్బమ్ ద్వారా మొదట తమిళ సినిమాలో అవకాశం లభించింది. శివకాశి సినిమా ద్వారా ప్రేక్షకులకు పరిచయమైంది.

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006.
AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR